www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 20 ఏప్రిల్ 2025

5

పశ్చిమ గోదావరి




ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - భీమవరం

2025-26 విద్యా సంవత్సరానికి అన్ని ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద, బలహీన వర్గాల పిల్లలకు ఒకటో తరగతిలో ఉచితంగా 25 శాతం సీట్లు కేటాయించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లలు కలిగిన తల్లిదండ్రులు ఏప్రిల్ 28వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, నిబంధనల మేరకు సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు తల్లిదండ్రుల ఆధార్, ఓటర్ ఐడి, రేషన్, జాబ్‌కార్డు, విద్యుత్ బిల్లు ఏదోకటి సమర్పించాలని, అలాగే పిల్లల పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎపిసి శ్యామ్‌సుందర్ ఆ ప్రకటనలో కోరారు.

పేదలపై పోలీసుల ప్రతాపం..



బైఠాయించిన పేదలు



నేతలను అరెస్ట్ చేసి తరలిస్తున్న జీపును చుట్టుముట్టి అడ్డుకున్న పేదలు

పాలకోడేరు ఎఎస్‌ఆర్ నగర్‌లో తీవ్ర ఉద్రిక్తత

ఇళ్ల తొలగింపును అడ్డుకున్న పేదలు, సిపిఎం నేతలు

మహిళలపై మగ పోలీసుల కీచకపర్వం

దొరికిన వారిని దొరికినట్లు లాగేసిన ఖాకీలు

ఒక మహిళ తలకు బలమైన గాయం, మరో ఏడుగురికి అస్వస్థత

ఇళ్లు తొలగిస్తే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించిన బాధితులు

వెనక్కి తగ్గిన అధికార యంత్రాంగం

పేదలపై ఎంఎల్‌ఎ యుద్ధం సరికాదు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



గాయాల పాలైన వ్యక్తి



గాయాల పాలై స్పృహ తప్పిన మహిళ



గాయాల పాలైన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - భీమవరం

మండల కేంద్రమైన పాలకోడేరు శివారు ఎఎస్‌ఆర్ నగర్ శనివారం రణరంగంగా మారింది. అధికార యంత్రాంగం పేదల ఇళ్ల తొలగింపునకు యత్నించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు దురుసుగా వ్యవహరించడంతోపాటు మహిళలని చూడకుండా ఎక్కడపడితే అక్కడ చేతులేసి దొరికిన వారిని దొరికినట్లు లాగి పడేశారు. ఈ ఘటనలో ఒక మహిళకు తీవ్ర గాయాలవ్వగా, మరో ఏడుగురు పేదలు గాయాల పాలై స్పృహ తప్పి పడిపోయారు. ఈ నేపథ్యంలో ఎఎస్‌ఆర్ నగర్‌లోకి అధికార యంత్రాంగాన్ని వెళ్లనీయకుండా పేదలు రోడ్డుపై బైఠాయించారు. ఒక్క అడుగు ముందుకేసినా, ఇళ్లు తొలగించినా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామంటూ పెట్రోల్ బాటిళ్లు చేతబూని నిరసన తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

స్థానిక ఎఎస్‌ఆర్ నగర్‌లో ఇరిగేషన్ కాలువ గట్టుకు చేర్చి 1986 నుంచి 130 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నాయి. వీరిలో 35 కుటుంబాలకు ప్రభుత్వ లేఅవుట్లో స్థలాన్ని చూపించినప్పటికీ కోర్టు కేసు నడుస్తుండటంతో ప్రభుత్వం లబ్ధిదారులకు స్వాధీనం చేయలేదు. అయితే కాలువల ప్రక్షాళన, అభివృద్ధి, కాలుష్యం పేరుతో ఇరిగేషన్, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఉన్న ఆక్రమణల తొలగింపునకు ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు చర్యలు చేపట్టారు. అయితే ఎన్నో ఏళ్ల నుంచి ఈ భూమినే నమ్ముకుని ఉన్నదంతా ఇంటి నిర్మాణానికి ఖర్చు చేసి నిరుపేదలంతా ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. అయితే ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాల పేరుతో వారికి ఎటువంటి ప్రత్యామ్నాయమూ చూపించకుండానే ఇళ్లను తొలగించడానికి కొంతకాలంగా ప్రయత్నాలు సాగుతున్నాయి. శనివారం ఉదయమే పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతోపాటు పోలీసులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. భీమవరం, భీమవరం రూరల్‌తోపాటు చుట్టుపక్కల పోలీస్ స్టేషన్ల నుంచి సుమారు 50 మంది పోలీసులు, మహిళా పోలీసులు మొహరించారు. మూడు జెసిబిలతో ఇళ్లు తొలగించేందుకు పోలీసు బందోబస్తు నడుమ అధికార యంత్రాంగం ముందుకు కదిలింది. ఈ నేపథ్యంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్యతోపాటు నిరుపేదలు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే జెసిబిలు నిలుపుదల చేయకుండా ముందుకు కదిలించడంతో పేదలంతా పెట్రోల్ సీసాలతో నేలపై బైఠాయించారు. ఇళ్లు తొలగించాలని చూస్తే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో పోలీసులు, నిరుపేదల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని తోపులాటకు దారి తీసింది. ఈ క్రమంలో పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలని చూడకుండా మగ పోలీసులు ఇష్టానుసారం చేతులేసి లాగే ప్రయత్నం చేయడం చర్చనీయాంశమైంది.

ప్రతిఘటించిన నిరుపేదలు

ఇళ్లను కాపాడుకోవడానికి రోడ్డుకు అడ్డంగా కూర్చున్న పేదలను భయపెట్టేందుకు అగ్నిమాపక వాహనం ద్వారా వాటర్ గన్స్‌తో నీళ్లు చిమ్మేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. అయితే బాధిత ప్రజలు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని మరోసారి పెద్దఎత్తున నినదించారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారి నుంచి పెట్రోల్ బాటిళ్లను స్వాధీనం చేసుకునేందుకు యత్నించడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఒక వ్యక్తి శరీరంపై పెట్రోల్ పోసుకునే సమయంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పెట్రోల్ అంతా పోలీసులు, పక్కనే ఉన్నవారిపై పడింది. దీంతో పోలీసులు వెనక్కి తగ్గారు. దీంతో ఆ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ జీపులో తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. బాధిత ప్రజలందరూ పోలీసు వాహనానికి అడ్డుపడ్డారు. దీంతో పోలీసులు సత్యనారాయణను విడిచిపెట్టారు. సిపిఎం మండల కార్యదర్శి అశ్రియ్యను కూడా అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న క్రమంలో పేదలు అడ్డుకుని ప్రతిఘటించారు.

నాగరవు ఈశ్వరికి తలకు గాయం, మరో ఏడుగురికి అస్వస్థత

పోలీసులకు, నిరుపేదలకు మధ్య జరిగిన ఘర్షణలో నాగరవు ఈశ్వరి తలకు బలమైన గాయమైంది. తోపులాటలో స్పృహకోల్పోయి ఉన్న కల్వర్టుపై పడటంతో తలకు గాయమై రక్తస్రావమైంది. దీంతో హుటాహుటిన అంబులెన్స్‌లో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మరో ఏడుగురు తోపులాటలో అస్వస్థతకు గురయ్యారు. మల్లుల సావిత్రి, మెట్ట భారతి, హనుమంతు చిన్న, దేవరపు సత్యవతి, దొంగ వరలక్ష్మి, జోగి సత్యవతి, మల్లుల రామకృష్ణలకు స్వల్ప గాయాలై అస్వస్థతకు గురవ్వడంతో వారిని పాలకోడేరు పిహెచ్‌సికి తరలించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో పోలీసులు, అధికారులు వెనక్కి తగ్గి అక్కడ నుంచి వెళ్లిపోయారు.



మహిళలను అసభ్యంగా తాకుతున్న పోలీసు (బ్లూషర్ట్)

ఎంఎల్‌ఎ అహంకార పూరిత పాలనను అడ్డుకుంటాం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ఉండి ఎంఎల్‌ఎ అహంకారపూరిత, దుర్మార్గ పాలనను అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఎఎస్‌ఆర్ నగర్‌లో ఆయన శనివారం పర్యటించి బాధిత ప్రజలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ దుర్యోధనుడిని తలపించే దుర్మార్గ పాలనతో పేదలపై యుద్ధం చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడు నెలల కాలంలోనే నియోజకవర్గంలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న కొన్ని వందల కుటుంబాల పేదల ఇళ్లను అక్రమంగా తొలగించారన్నారు. పాలకోడేరులో ఎఎస్‌ఆర్ నగర్ 1986లో వరదల సమయంలో ఏర్పడిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఈ కాలనీకి అన్ని సౌకర్యాలనూ కల్పించిందని గుర్తు చేశారు. ప్రస్తుత ఎంఎల్‌ఎ రఘురామ కృష్ణంరాజు భూస్వాములకు, సంపన్నులకు మేలు చేయడం కోసం పేదల ఇళ్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. మగ పోలీసులు దౌర్జన్యంగా మహిళలపై అసభ్యకరంగా చేతులు వేసి దుర్మార్గంగా వ్యవహరించడం అత్యంత అమానుషమన్నారు. మగ పోలీసులే మహిళలపై భౌతిక దాడి చేయడంతో పలువురు గాయాల పాలయ్యారని తెలిపారు. పేదల ఇళ్ల తొలగింపును ఆపకపోతే సహించేది లేదన్నారు. తహశీల్దార్ నుంచి డిఎస్‌పి వరకు అధికారులందరినీ ఎంఎల్‌ఎ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారని ఆరోపించారు. ఎంఎల్‌ఎ రఘురామ కృష్ణంరాజు దుర్మార్గాన్ని కచ్చితంగా అడ్డుకుంటామని, పేదలపై ఎంఎల్‌ఎ యుద్ధానికి వ్యతిరేకంగా సిపిఎం పోరాడుతుందని హెచ్చరించారు.

పేదల ఇళ్లు కూల్చడమే ఎంఎల్‌ఎ లక్ష్యం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

పేదల ఇళ్లు కూల్చడమే ఎంఎల్‌ఎ లక్ష్యంగా పెట్టుకున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. ఇళ్ల బాధితులను ఉద్దేశించి సత్యనారాయణ మాట్లాడారు. రాష్ట్రంలో, జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఉండి నియోజకవర్గంలో రఘురామకృష్ణంరాజు పేదల ఇళ్లను కూల్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆయనకు పేదల ఇళ్లు కూల్చే శాఖను అప్పగిస్తే మంచిదని ఎద్దేవా చేశారు. ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లు తొలగించాలని ప్రయత్నిస్తే జిల్లావ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు దున్న మరియమ్మ, మట్టదన, గుడాల బుల్లెమ్మ, పాలా లక్ష్మి, సంపా లక్ష్మి, మల్లుల దుర్గారావు, మెట్ట రామారావు, యర్రా బంగారయ్య, పెచ్చెట్టి సత్యనారాయణ, జోగి నరసింహమూర్తి, బాజింకి సతీష్, గుత్తుల దుర్గారావు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు తొలగించే శాఖను అప్పగించారా..!

ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు తీరుపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం విమర్శ



భీమవరంలో నిరసన తెలియజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

పేదల ఇళ్లను తొలగించడానికి ఉండి ఎంఎల్‌ఎకు ప్రభుత్వం ఒక శాఖను అప్పగించినట్లుగా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం అన్నారు. పాలకోడేరు మండలంలో సంవత్సరాలు తరబడి ఇళ్లు వేసుకుని నివశిస్తున్న పేదలపై ప్రభుత్వ దురహంకారంతో దాడి చేసి దుర్యోధనపర్వానికి ఎంఎల్‌ఎ తెర లేపారని విమర్శించారు. ఎఎస్‌ఆర్ నగర్‌లో పేదల ఇళ్ల తొలగింపు యత్నాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన భీమవరం ప్రకాశం చౌక్‌లో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ పోలీసుల దాడిలో మహిళలు, వృద్ధులు, పిల్లలు గాయాల పాలవ్వడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం తమకు ఏదో చేసి పెడుతుందని ఆశించిన పేదలకు దాడులు, దౌర్జన్యాలు తప్ప మరేమీ కన్పించడం లేదన్నారు. పాలకోడేరు పుంతలో ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రభుత్వం కల్పించిన సదుపాయాలతో ఇళ్లు నిర్మించుకుని పేదలు చాలాకాలంగా జీవిస్తున్నారని, కాల్వకుగాని, రోడ్డుకుగాని ఏ ఆటంకమూ లేకుండా బతుకుతున్నారని, అట్లాంటి పేదలపై దాడి చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. అడ్డు వెళ్లిన మహిళలను ఘోరంగా తోసేసి గాయాల పాల్జేసి ఏం సాధించాలనుకుంటున్నారని నిలదీశారు. పుంత పొడవునా సుమారు అరెకరం వెడల్పున పోరంబోకు భూమి ఆక్రమణకు గురైందని, దానిపై వెళ్లే దమ్ము ఎంఎల్‌ఎకు లేదని అన్నారు. ఎంఎల్‌ఎ తీరు ఇలానే కొనసాగితే ప్రభుత్వ పతనం తప్పదని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పార్టీ, ప్రభుత్వ పెద్దలు ఈ అకృత్యాలకు అడ్డుకట్ట వేయగలిగితే అంత మంచిదని సూచించారు. లేనిపక్షంలో ప్రజలే తమదైన శైలిలో అడ్డుకట్ట వేస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, వడుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాళ్ల: ఎఎస్‌ఆర్ నగర్‌లో పేదల ఇళ్లు తొలగించేందుకు యత్నించడం, అడ్డుకున్న పేదలపై పోలీసుల తీరు దారుణమని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ తెలిపారు. బొండాడలో అంబేద్కర్‌బొమ్మ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్యక్రమంలో చందన భవాని, నాగమణి, పేదలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉండి: ఎఎస్‌ఆర్ నగర్‌లో నిరుపేదల ఇళ్లు కూల్చివేసే యత్నాలను నిరసిస్తూ శనివారం స్థానిక మెయిన్ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు. సిపిఎం నేత ధనికొండ శ్రీనివాస్, మండల కార్యదర్శి చీర్ల శేషు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రామకూరి వెంకటరత్నం, నిమ్మితి కిషోర్, కింతాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆచంట: ఎఎస్‌ఆర్ నగర్‌లో పేదల ఇళ్లు అక్రమంగా తొలగించడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతగోపాలన్ అన్నారు. శనివారం సాయంత్రం మార్కెట్లో ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు పేదల ఇళ్లు అక్రమంగా తొలగించేందుకు నిరసనగా ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి మోహన్ రావు, నాయకులు సూర్నీడి వెంకటేశ్వరరావు, దాసిరెడ్డి కోటేశ్వరరావు, తలుపురి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, తోటపల్లి సత్యనారాయణ, బండి రంగారావు, మన్నె బ్రహ్మయ్య, చదలవాడ చంటిబాబు, బాలాజీ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: పాలకోడేరు ఎఎస్‌ఆర్ నగర్‌లో ప్రభుత్వ దమన కాండను వెంటనే ఆపాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక దొరగారి చెరువు సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, బివి.వర్మ, డి.రవితేజ తదితరులు మాట్లాడగా బి.సుబ్బారావు, కె.ప్రసాద్, నెల్లి సూరిబాబు, ఎస్.సత్యనారాయణ, ప్రవీణ్, రమణ, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుమంత్ర: పేదల ఇళ్లు కూల్చివేతను నిరసిస్తూ బ్రాహ్మణ చెరువు సివిల్ సప్లయిస్ గోడౌన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆకుల హరేరామ్ మాట్లాడగా సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్, నేతలు కూసంపూడి సుబ్బరాజు, చింతపల్లి లక్ష్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.

కులుషిత నీటిని అరికట్టాలని ఆందోళన

ప్రజాశక్తి - వీరవాసరం

పెర్కిపాలెంలో నీటి కలుషితాన్ని అరికట్టి, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని పెర్కిపాలెం గ్రామస్తులు సిపిఎం మండల కార్యదర్శి బొర్రా అలమహారాజు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ అప్పారావుకు వినతిపత్రం అందజేసి ఆయనకు తమ గ్రామంలోని తాగునీటి కష్టాలను వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా తమ గ్రామంలోని తాగునీటి చెరువులో రొయ్యల చెరువు నీరు కలిసి కలుషితమవుతున్నా రొయ్యల చెరువుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదో అర్థం కావడం లేదన్నారు. ప్రజల ఆరోగ్యం కన్నా రొయ్యల చెరువుల యజమానులకే ప్రాధాన్యత ఇవ్వడం పట్ల అధికారుల తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తాగునీటి చెరువు పసర్లుగా మారడంతో తాగేందుకు పనికి రావడం లేదన్నారు. ఆ నీటినే పంచాయతీ వారు సరఫరా చేస్తున్నారని, దీంతో పలువురు గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జుత్తిగ నరసింహమూర్తి, యండమూరి సుబ్బారావు, బొక్కా కూర్మారావు, తాళ్లూరి రాములు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

చెత్తను నియంత్రించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

చెత్తను నియంత్రించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మహిళలు చాలా చైతన్యవంతులు, శక్తివంతులని, ఏ కార్యక్రమం చేపట్టినా దిగ్విజయంగా పూర్తి చేయగలరని అన్నారు. శనివారం పట్టణంలోని నాలుగో వార్డు అమ్మ కళ్యాణ వేదికపై స్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమంలో, 14వ వార్డు బీఆర్ మార్కెట్లో తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చే ప్రక్రియ పరిశీలన కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాలుగో వార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మహిళలు శ్రద్ధ తీసుకుని పొడి, తడి చెత్తలను ఇంటి వద్దే వేరు చేసి ఇచ్చే బాధ్యతను సక్రమంగా నిర్వహించాలన్నారు. చిన్నప్పటి నుండి పిల్లలకు చెత్త నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. ఇ-వ్యర్థాలను సరైన రీతిలో తొలగించకపోతే వాటి నుంచి వెలువడే రసాయనాలు పిల్లలు, గర్భిణులకు ఎంతో ప్రమాదకరంగా పరిణమిస్తాయని అన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలు, వ్యర్థాలను మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇ-వ్యర్థాల సేకరణ కేంద్రంలో అందజేయాలన్నారు. స్వచ్ఛ తాడేపల్లిగూడెంగా తీర్చిదిద్దేలా ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ చెత్త నిర్మూలన మన బాధ్యతగా అనుకున్నప్పుడే లక్ష్యాన్ని సాధించగలుగుతామన్నారు. కాలువలు, చెరువుల్లో చెత్త వేయడం, వాటిని తిన్న చేపలను మనం తినడం వలన అనారోగ్యం పాలవుతున్నామన్న విషయాన్ని గ్రహించాలన్నారు. కేన్సర్ తదితర అనారోగ్యాలకు గురికాకుండా ముందే జాగ్రత్త పడాలన్నారు. ఇ-వ్యర్థాలు, ప్లాస్టిక్ బాటిళ్ల కొనుగోలుకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారని, వాటి ద్వారా విక్రయించి కొంత నగదును కూడా పొందవచ్చని తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణంలో కల్తీ ఆహార పదార్థాల విక్రయంపై పలు తనిఖీలు నిర్వహించామని, నిషేధిత ఫుడ్ కలర్స్, టెస్టింగ్ సాల్ట్, మళ్లీ మళ్లీ కాచిన నూనె, కల్తీ నూనె ఎట్టి పరిస్థితుల్లో వినియోగించరాదని అన్నారు. దాడుల్లో ఇటువంటి వస్తువులు కల్తీ చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని, రాజీ పడేది లేదని హెచ్చరించారు. అధికారులు కూడా తనిఖీలు ముమ్మరం చేయాలని, తనిఖీల విషయంలో వారికి పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు సభలోని మహిళలు, అధికారులు, సిబ్బందితో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కొంతమంది మహిళల నుండి ఇ-వేస్ట్‌ను కొనుగోలు చేసి నగదు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తడి చెత్త నుండి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలి

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా 14వ వార్డు బీఆర్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కంపోస్ట్ యూనిట్‌ను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. కూరగాయల వేస్ట్‌ను ఎరువుగా తయారుచేసే ప్రక్రియలో భాగంగా కంపోస్ట్ యూనిట్‌లో కూరగాయల వేస్ట్‌ను వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయి వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి - నరసాపురం

ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. శనివారం వేములదీవి తూర్పు గ్రామంలో ఉపాధి కూలీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్ట ప్రకారం పని చేసిన 15 రోజుల్లోగా కూలీలకు వేతనాలు చెల్లించాలన్నారు. అయితే కొన్ని గ్రామాల్లో మూడు నెలలు దాటినా ఇంతవరకు వేతనాలు జమ కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు పెరిగిన ధరల భారం, మరోవైపు వేతనాలు అందకపోవడం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పని సమయంలో మృతి చెందిన కూలీల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుమాని కనకరాజు, తిరుమాని వీర్ల వెంకయ్య, బస్వాని భీమరాజు, తిరుమాని పెద్దింట్లమ్మ, పోతాబత్తుల అనసూర్య, తిరుమాని కాళికమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఉపాధి హామీ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పర్యటనలో భాగంగా శనివారం మండలంలోని లింగారెడ్డిగూడెంలో ఉపాధి పనుల ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జనవరి నుండి పని చేస్తున్నా ఇంత వరకు డబ్బులు పడలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ తక్షణమే బకాయిలు చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొనకల వరలక్ష్మి, కట్ట గోవర్ధన, గరగ అనిత, కాళ్ల సీత తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో తిరుమల విజయభేరీ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో తిరుమల యాజమాన్యం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జెఇఇ మెయిన్స్ - 2025 పరీక్షల్లో భీమవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. శనివారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ జెఇఇ మెయిన్స్ నిర్వహించిన ఎన్‌టిఎ పరీక్షా ఫలితాలు విడుదల చేయగా అందులో వివిధ విభాగాల నుండి తిరుమల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో మెరిశారన్నారు. ఆల్ ఇండియా 276వ ర్యాంకుతో డి.సుశాంత్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పిజె.హర్ష వర్ధన్ 394వ ర్యాంకు, జి.నిఖిల్ వర్మ 633వ ర్యాంకు, ఎ.శివకార్తీక్ 804వ ర్యాంకు, బి.హరిరామ్ 845వ ర్యాంకు, కె.శివ 846వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఎన్.మణిదీప్ కుమార్ 1387వ ర్యాంకు, టి.నరేంద్రకుమార్ 1567వ ర్యాంకు, జి.సుజన్ 1653వ ర్యాంకు, ఎన్‌వి.మనోజ్ఞ 1754వ ర్యాంకు, ఎం.సాయి చరణ్ 1973వ ర్యాంకు సాధించారు. విద్యా సంస్థ డైరెక్టర్లు ఎన్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్‌బాబు మాట్లాడుతూ ఆల్ ఇండియా 500 ర్యాంకులోపు ఇద్దరు సాధించినట్లు తెలిపారు. 1000లోపు ర్యాంకులు ఆరుగురు, 2000లోపు ర్యాంకులు 11 మంది, 5000 లోపు ర్యాంకులు 19 మంది, 10 వేలలోపు ర్యాంకులు 45 మంది, 20 వేల లోపు ర్యాంకులు 1000 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. సుమారు 90 మందికి పైగా తిరుమల విద్యార్థులు భీమవరం బ్రాంచి నుండే నిట్, ఐఐఐటి, కళాశాలల్లో అడ్మిషన్లు సాధించగలరని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, బోధించిన ఉపాధ్యాయులను, సహకరించిన తల్లిదండ్రులను అభినందించారు.

ఆదిత్య విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - పాలకొల్లు

దేశంలో ప్రతిష్టాత్మకమైన ఐఐటి, ఎన్ఐటిలో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు జాతీయస్థాయిలో నిర్వహించిన జెఇఇ మెయిన్స్ పరీక్షా ఫలితాలలో పాలకొల్లు ఆదిత్య విద్యార్థులు ముందంజలో ఉన్నారు. కుక్కల గిద్యోన్ 98.6246135 పర్సంటైల్, సిద్ధిరెడ్డి సత్యనారాయణ 98.5265876 పర్సంటైల్, మల్లూరి ముఖేష్ 98.4038118 పర్సంటైల్, గోకవరపు అఖిల్ 97.8743268 పర్సంటైల్, పిల్లా రామ్ చరణ్ 97.8472607 పర్సంటైల్, మధిర అనిరుధ్ 97.7663545 పర్సంటైల్, పీతల సాత్విక 96.0205287 పర్సంటైల్ సాధించారని సంస్థ డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వారిని విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్‌వి.రాఘవరెడ్డి, ఎఒ జి.వాసుబాబు అభినందించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా నాయకురాలు కళ్యాణి

ప్రజాశక్తి - గణపవరం

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికవర్గం జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకురాలు డి.కళ్యాణి అన్నారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన సిఐటియు మండల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షులు ఎం.వెంకటరావు అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. లేబర్ కోడ్ల రద్దుపై జరిగే సమ్మెలో కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మండల కార్యదర్శి కె.గోవింద్ మాట్లాడుతూ మేడేను జయప్రదం చేయాలన్నారు. మండలంలోని 25 గ్రామాల్లో సిఐటియు పతాకాలను ఆవిష్కరించాలని చెప్పారు. ఈ సమావేశంలో అంగన్వాడీ, ఆశాలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మొగల్తూరు: ఇటీవల మృతి చెందిన ఉపాధి హామీ కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు అన్నారు. శనివారం మొగల్తూరులోని సుబ్రహ్మణ్యేశ్వరంలో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. బాధిత కుటుంబ సభ్యులకు పరిహారం అందించాల్సిన ఆవశ్యకత ప్రభుత్వానికి ఉందన్నారు. ఆయన వెంట జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, కుక్కల కృష్ణమోహన్, రేవు నారాయణమూర్తి, తన్నీడి గిరి ఉన్నారు.

కొయ్యేటిపాడు పాఠశాలలో విద్యార్థుల చేరిక

పెనుమంట్ర: మండలంలోని కొయ్యేటిపాడులో ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త విద్యార్థులను చేర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సెలవు రోజుల్లో మినహా మంగళవారం నుండి శనివారం వరకూ స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఉదయం నుండి సాయంత్రం వరకూ గ్రామంలో ప్రతి ఇంటినీ సందర్శించి ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని స్వయంగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా పెనుమంట్ర మాజీ జెడ్‌పిటిసి, గ్రామ ప్రముఖులు సత్తి ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రెగ్యులర్, స్పెషల్ పాఠశాలలు రెండూ రోల్ తక్కువగా ఉన్నందున అవి కొత్తగా వచ్చిన విద్యా శాఖ వారి నిబంధనలు వల్ల మూత పడకుండా ఉండాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం ఎనిమిది మంది కొత్త విద్యార్థులు పాఠశాలల్లో చేరారని తెలిపారు.

ఇపిఎఫ్ పింఛను పెంచాలి

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వం ఇపిఎఫ్ పెన్షన్లు పెంచాలని సహకార బ్యాంకు ఉద్యోగుల రాష్ట్ర సంఘం మాజీ అధ్యక్షులు, వినియోగదారుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య డిమాండ్ చేశారు. 30 సంవత్సరాల పైబడి సర్వీసులు ముగించుకుని రిటైర్ అయిన వ్యక్తికి ప్రభుత్వం రూ.వెయ్యి, రూ.1500 పెన్షన్ ఇవ్వడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగులతో సమానంగా తాము పూర్తి సేవలందించామని అయినా తమ బతుకులు హీనమైన దశకు చేరుస్తున్నారన్నారు. కనీస వేతనం పది వేల రూపాయలు అందించి తమ కుటుంబాలను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉప కారాగారం తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్ శనివారం స్థానిక ఉప కారాగారాన్ని తనిఖీ చేశారు. జైలు ముద్దాయిలకు కేసుల వివరాలు, సంబంధిత పోలీస్ వారి నుంచి వాయిదాలు తెలుస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఉపయోగించుకోవాలని ముద్దాయిలకు వివరించారు. ఉప కారాగారంలో అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యం, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు తదితర విషయాలను ముద్దాయిలను, జైలర్‌ను అడిగి తెలుసుకున్నారు. జైల్ ముద్దాయిల తరపున నియమించబడిన ప్రతి ఉచిత న్యాయ సలహాదారుడూ బాధ్యతగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఎన్.ఆనంద్‌బాబు, జైల్ విజిటింగ్ లాయర్, కె.శిరీష, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

పలు చోట్ల పోషణ్ పక్వాడా

ఉండి: చిలుకూరులో ఆకివీడు సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా లభించే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం సిహెచ్ అగ్రహారంలో అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఐసిడిఎస్ పిప్పర సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్ దుర్గాభవాని మాట్లాడారు. రెండేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టికాలు వేయించుకోవాలని చెప్పారు. ఎఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ టి.పోశమ్మ, ఎస్.వెంకటలక్ష్మి, పి.వరలక్ష్మి తెలిపారు. పోషణ్ పక్వాడాలో భాగంగా మార్టేరు 5, 6 అంగన్వాడీ కేంద్రాలు, సోమరాజు ఇల్లింద్రపర్రు కేంద్రంలో జరిగిన కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

నరసాపురం: అగ్నిమాపక వారోత్సవాలు ఆరో రోజు శనివారం సూర్య హాస్పటల్ సిబ్బందికి, నర్సులకు, ప్రజలకు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. డాక్టర్లు, నర్సులకు, ఇతరులకు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా తమ ప్రాణాలను రక్షించుకోవడమే కాకుండా రోగుల ప్రాణాలు ఏవిధంగా రక్షించాలో చూపించారు. కార్యక్రమంలో నరసాపురం అగ్నిమాపక కేంద్ర అధికారి కె.భాస్కరరామమ్, సూర్య హాస్పటల్ డాక్టర్ ఎల్.నరసింహారావు, ఎల్.దేవికృష్ణ, హాస్పిటల్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వేములదీవిలో చలివేంద్రం

నరసాపురం: వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేలా గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామ పెద్ద చెన్నాప్రగాడ చక్రధరరాజు (చక్రి) అన్నారు. శనివారం వేములదీవి పడమర పంచాయతీ గొందిమూల సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చెన్నాప్రగాఢ చక్రధర్‌రాజు ప్రారంభించారు. గ్రామానికి చెందిన కవురు శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో చలివేంద్రం ఏర్పాటుచేశామని నిర్వాహకులు తెలిపారు.

జ్యూట్ సంచుల పంపిణీ

ఉండి: ప్లాస్టిక్‌ను విడనాడి కేన్సర్ బారిన పడకుండా తమను తాము రక్షించుకోవాలని ఐక్య నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధి, జాతీయ అవార్డు గ్రహీత విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ముదునూరి శివరామరాజు అన్నారు. శనివారం ఉండి మెయిన్ సెంటర్‌లో పలువురికి జ్యూట్ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివ రామరాజు మాట్లాడుతూ రెండు నెలలుగా పలు రూపాల్లో అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రఘురామ కృష్ణంరాజు ఆదేశాలతో తాము ప్లాస్టిక్ నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి జి.వెంకట సత్యనారాయణ, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు, విశ్రాంత ఉపాధ్యాయులు గాదిరాజు రంగరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.గోపాలరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ డాక్టర్ నళిని మృతి

పాలకొల్లు : నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో ఆర్ఎంఒగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వల్లూరు నళిని (59) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున పాలకొల్లు సమీపంలోని పూలపల్లిలో మృతి చెందారు. ఆమె ఎక్కువ కాలం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా పనిచేశారు. ఆమె మృతదేహానికి పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఎంఆర్‌పిఎస్ నివాళులర్పించారు. ఆమె అంత్యక్రియలు విజయవాడ సమీపంలోని తోట్లవల్లూరులో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

పాలిసెట్‌పై శిక్షణ

తాడేపల్లిగూడెం: పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగం గ్యారంటీగా ఉంటుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న పాలిసెట్ - 2025 ఉచిత శిక్షణ తరగతులను శనివారం కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. చిన్న వయసులోనే స్థిరమైన ఉద్యోగంతో కుటుంబానికి ఆర్థికంగా దన్నుగా ఉండేందుకు పాలిటెక్నిక్ కోర్స్ దోహదపడుతుందన్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగం గ్యారంటీతో పాటు, ఇంజినీరింగ్ చదువుకునే అవకాశం కూడా ఉంటుందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, ఇతర విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

తూర్పుతాళ్లులో ఫేర్‌వెల్

నరసాపురం: చిన్నారులకు విద్యతోపాటు, సత్ప్రవర్తన నేర్పినప్పుడే ఆ విద్యార్థి అన్ని రంగాల్లో ముందు ఉండగలరని తూర్పుతాళ్లు జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం డి.అనిల్ కుమార్ అన్నారు. శనివారం తూర్పుతాళ్లు ఎంపిపి స్కూల్ వద్ద ఫేరవెల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్, గోల్డ్ మెడల్, మెమెంటో, ప్రొగ్రెస్ రిపోర్టులను అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్ఎంసి ఛైర్మన్ ఎం.బాలదుర్గ, వైస్ ఛైర్మన్ ఆర్.నరసింహారావు, హెచ్ఎం పి.అరుణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం : సర్పంచి


పెదఅమిరం గ్రామంలో సిమెంట్ రోడ్డు విస్తరణ పనులు

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరంలో ప్రస్తుతం కోటి రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సర్పంచి డొక్కు సోమేశ్వరరావు తెలిపారు. శనివారం పెదఅమిరంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. పెదఅమిరం గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు ఆర్థిక సాయం రూ.10 లక్షలు, పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో తాగునీటి చెరువు వద్ద మైక్రో వాటర్ ఫిల్టర్ ప్లాంట్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. చెరువు వద్ద ప్రహరీ గోడ నిర్మాణ పనులు పంచాయతీ నిధులు రూ.6 లక్షలతో జరుగుతున్నాయన్నారు. కోనేరు తాగునీటి చెరువు వద్ద మరో మైక్రో వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆర్థిక సాయం రూ.25 లక్షలతో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తయినట్లు తెలిపారు. గ్రామ రెవెన్యూ కార్యాలయం నుంచి కోరా రామ్మూర్తి వరకూ రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులు ఐదు నుంచి ఆరడుగుల వెడల్పుతో సిమెంట్ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. గ్రామంలో సిమెంట్ రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను మరో చోటికి మార్చడంతో పాటు సుమారు మూడు లక్షల వేల రూపాయలతో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రిస్టియన్‌పేటలో సిమెంట్ రోడ్డు విస్తరణ, సిమెంట్ డ్రెయినేజీ పనులను రూ.12 లక్షలతో, నెహ్రూ పేటలో సుమారు రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్డు విస్తరణ పనులు పనులు చేపడతామన్నారు. 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సుమారు రూ.9 లక్షలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఘనంగా స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో డంపింగ్ యార్డులన్నింటినీ ఖాళీ చేసే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పట్టణంలోని 30వ వార్డులో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర పారిశుధ్య పనుల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. తాగు, సాగునీరందించే పంట కాలువ పట్టణ వెంబడి చెత్తా చెదారం, వ్యర్థాల గుట్టలను మంత్రి పారతో తొలగించి ఆ వ్యర్థాలను పారిశుధ్య కార్మికులతో కలిసి ట్రాక్టర్లోకి వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జగన్ మురికి ఆంధ్రప్రదేశ్‌గా మార్చగా చంద్రబాబు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. జగన్ ఐదేళ్ల పాలనలో పట్టణాల్లో ప్రజలపై చెత్త పన్ను భారం వేస్తే కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.

గణపవరం : ప్రతి 3వ శనివారం గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గణపవరం సర్పంచి మూర అలంకారం, డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ర్యాలి నిర్వహించారు. గ్రామంలో వ్యర్థాలతో స్థానికులకు కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ వైకెవి.అప్పారావు అన్నారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మి, ఇఒపిఆర్‌డి ఒ.పి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ప్రపంచ చెత్తలో ఈ వేస్ట్ అత్యధికంగా ఉంటుందని, దాన్ని ప్రత్యేకించి సేకరించి రీసైకిల్‌కు పంపించడం ద్వారా మానవాళి మనుగడకు రక్షణ కలుగుతుందని పెదతాడేపల్లి సర్పంచి పోతుల అన్నవరం పేర్కొన్నారు. పెదతాడేపల్లిలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఈ వేస్ట్ కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్, ఎంపిటిసిలు గోవింద్, సత్యనారాయణ, ఉపసర్పంచి అత్తంటి సోమరాజు, కార్యదర్శి రవిచంద్ర పాల్గొన్నారు.

ఆకివీడు : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సందర్భంగా అజ్జమూరు గరువు ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ భిన్నమైన కార్యక్రమం చేపట్టారు. పరిసరాలు శుభ్రం చేయడం అన్ని కార్యాలయాల్లో జరుగుతోంది. అయితే ఆయన రెండు నెలలుగా ఆయా కార్యక్రమాలు పూర్తిచేసి ప్రస్తుతం గ్రామం అంతా ప్రచారం ప్రారంభించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ ఆయన ఒక్కరే కాకుండా ఆయనతోపాటు స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ ఎం రాజేశ్వరి, సహోపాధ్యాయులు కళ్యాణి, విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకొని గ్రామం అంతటా పర్యటించారు. పారిశుధ్యం లోపించిన చోట, ప్లాస్టిక్ పాలిథిన్ పేపర్లు కాగితాలు ఉన్నచోట వాటిని అన్నింటిని ఏరుతూ వాటి వల్ల వచ్చే నష్టాలను ప్రమాదాలను ప్రజలకు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

వీరవాసరం : పర్యావరణానికి హానికరంగా మారుతున్న ఈ వేస్టును బాధ్యతగా పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన ఈ వేస్ట్ కేంద్రం వద్ద అప్పజెప్పాలని సర్పంచి చికిలే మంగతాయారు అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమలో భాగంగా వీరవాసరం పంచాయతీ కార్యాలయం వద్ద ఈ వేస్ట్ సేకరణ కేంద్రాన్ని శనివారం సర్పంచి చికిలే మంగతాయారు ప్రారంభించారు. పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులు బహిరంగ ప్రదేశాల్లో పారవేయకుండా ఈ వేస్ట్ కేంద్రాల్లో అందజేయాలని సర్పంచి కోరారు. ఎంపిడిఒ అప్పారావు, వివిధ పంచాయతీ కార్యదర్శులు ఆశాలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ వేస్ట్ సేకరణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అయితే ఈ కార్యక్రమం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, వైస్ సర్పంచి బొను రాధారుక్మిణి, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఉండి : పాడైన ఎలక్ట్రికల్ వస్తువుల సేకరణ

తణుకు రూరల్ : సంక్షేమ వసతి గృహాల్లో వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకులోని సంక్షేమ వసతి గృహం పునర్నిర్మాణం చేపట్టి అందులో భాగంగా క్రీడాస్థలం నిర్మాణానికి ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇరగవరం కాలనీలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని శనివారం సందర్శించిన ఎంఎల్ఎ మాట్లాడారు. అంతకుముందు వసతి గృహం పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో తణుకు పట్టణాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. తణుకు పట్టణ పరిధిలోని ఇరగవరం కాలనీలో 12, 13 వార్డుల్లో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఎంఎల్ఎ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో కింది నుంచి పైస్థాయి వరకూ పారిశుధ్యం, ఇ వేస్ట్ అమలు చేసి గ్రామాలు క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం ఏప్రిల్‌లో ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను నిర్వీర్యం చేసుకునే విధంగా ప్రతిఒక్కరిలో అవగాహన రావాలన్నారు. ఇంటింటికీ వచ్చే పారిశుధ్య కార్మికులకు చెత్త అందజేసి సహకరించాలని కోరారు. అనంతరం అత్తిలిలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించి ర్యాలీ, అనంతరం కూడలిలో మానవహారం చేపట్టారు.

ఉండి : పంట కాలువలలో చెత్తాచెదారం ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే జరిమానా తప్పదని ఉండి డిసి ఉపాధ్యక్షులు మంతెన సాయిలచ్చిరాజు అన్నారు. శనివారం ఉండి పెద్ద వంతెన సెంటర్ నుంచి సబ్ రిజిస్టర్ కార్యాలయం వరకూ ఇరిగేషన్ ఎఇ ఫణి శంకర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి లచ్చిరాజు మాట్లాడుతూ పంట కాలువల్లో చెత్తా చెదారం చేయడం వల్ల సాగు, తాగునీరు కలుషితం అవుతోందన్నారు.

మొగల్తూరు : ఇ వ్యర్థాలు మానవ మనుగడకు ముప్పు గా పరిణమించనుందని ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్రలో భాగంగా మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయంలో శనివారం కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు. అనంతరం మానవహారం నిర్వహించారు. సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఉపసర్పంచి బోణం నరసింహారావు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు పాల్గొన్నారు.

నరసాపురం: యర్రంశెట్టివారి పాలెం గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచి యర్రంశెట్టి నాగ ముత్యమాంబబాబులు అధ్యక్షతన ఇ వ్యర్థాల సేకరణ, వాటిని నిల్వ ఉంచటానికి గొడౌన్‌ను ఏర్పాటు చేశారు. ఈ గోడౌన్‌ను రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ప్రారంభించి మాట్లాడారు. పరిసరాల శుభ్రత మన ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అందరి చేత సుబ్బారాయుడు ప్రతిజ్ఞ చేయించారు. మాజీ ఎఎంసి ఛైర్మన్ యర్రంశెట్టి బాబులు మాట్లాడారు. కార్యక్రమంలో వేములదీవి నీటి సంఘం అధ్యక్షులు అడ్డాల శ్రీనువాసు, ఇఒపిఆర్‌డి కె.నాగేంద్ర కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ టి.లోకేష్, సచివాలయం సెక్రటరీ కె. రఘురాం పాల్గొన్నారు.

నరసాపురంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు. బస్ స్టాండ్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, తహశీల్దార్ ఐవివి సత్యనారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆకివీడు : తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలోని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పీకి బాగు చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, విఆర్ఒలు, సర్వేయరు పాల్గొన్నారు.

ఉండి: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం మండల వ్యాప్తంగా అధికారులు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం గ్రామాల్లో ఒక్కో సేవా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని, ఈ నెలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రోడ్లపై పడేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించి వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందించాలని, వీటిని రీసైక్లింగ్ ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చే ఏర్పాట్లను చేసేందుకు వీలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, వాండ్రం సర్పంచి, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు దాసరి వెంకటకృష్ణ, ఉనుదుర్రు సర్పంచి పిన్నమరాజు నాగలక్ష్మి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆచంట: ప్రజలు అధికారులు సమిష్టి కృషితో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యసాధన కోసం పనిచేయాలని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆచంటలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అవగాహన ర్యాలీలో పితాని పాల్గొన్నారు. స్టేట్ బ్యాంకు నుంచి కచేరీ సెంటర్ ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు రుద్దరాజు వెంకటరామరాజు, ఎంపిపి దిగిమర్తి సూర్యకుమారి, సర్పంచి సరోజినీ, కేతా మీరయ్య, తమ్మినేడి ప్రసాద్ బీరా నరసింహమూర్తి పాల్గొన్నారు.

పెనుగొండ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి వై కిషోర్ తెలిపారు. శనివారం తడి, పొడి చెత్త, పాడైన ఎలక్ట్రికల్ వస్తువులపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి చింతపల్లి గనిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 4వ డివిజన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్, 27వ వార్డులో జెసి ఆధ్వర్యాన ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

పెనుమంట్ర : నెలమూరు, నెగ్గిపూడి గ్రామాల్లో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. నెలమూరులో జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపియుపి పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది, హెల్త్ డిపార్ట్మెంట్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'గుడి భూమి జోలికి రావొద్దు'

భీమవరం టౌన్: తరతరాల నుండి మా సంఘానికి మా రామాలయానికి గ్రామంలో శెట్టిబలిజ సంఘం పెద్దలు తప్ప, పాలకవర్గం ఎప్పుడూ లేదని దిరుసుమర్రు శెట్టిబలిజ సంఘం స్పష్టం చేసింది. శుక్రవారం సాయంత్రం తహశీల్దార్‌ను కలిచేందుకు వచ్చిన శెట్టిబలిజ సంఘం పెద్దలు కోళ్ల బాలకృష్ణ, కవరు పృథ్వి మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో మా రామాలయానికి ఎకరం ఆరు సెంట్ల భూమి ఉందన్నారు. ఈ భూమి తనదని గతంలో మా గ్రామానికి సంబంధం లేని వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆ కేసును రామాలయానికి అనుకూలంగా కొట్టేసిందన్నారు. అయితే ఈ భూమిపై వచ్చే ఆదాయాన్ని రామాలయంలో నిత్య దీప ధూప నైవేద్యానికి ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే తిరిగి ఆ వ్యక్తి కొడుకు మనోజ్ ఆ భూమి తనదేనని వీడియోలు చేస్తున్నాడని, అతను వీడియోలు మానుకోవాలని హెచ్చరించారు. అంతేకాకుండా ఎప్పుడు గుడికి పాలకవర్గం ఛైర్మన్ పదవులు లేవని అయితే గ్రామానికి చెందిన కేతా సత్యనారాయణ (సిఎం) తాను గుడి పాలకొరక ఛైర్మన్‌ను ఆ భూమి బాబూరావుకే చెందుతుందని కోర్టుకు వెళ్లేందుకు లెటర్ హెడ్ మీద రాశి ఇచ్చారన్నారు. అలాగే మంత్రి లోకేష్ కూడా వారు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై తమ సంఘ పెద్దలంతా మంత్రి లోకేష్‌ను కలుస్తామని ఈ భూమి రామాలయానికి చెందుతుందని, గతంలో కోర్టు కొట్టేసిన వాటిని కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అలాగే తహశీల్దార్, ఎంఎల్ఎ అంజి బాబును కలిసి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఇప్పటికైనా దేవుడు భూమి జోలికి రావొద్దని గ్రామస్తులు హెచ్చరించారు.

ధన్యజీవి అల్లం నాగమ్మ

ఆచంట: జీవితాంతం ఎర్రజెండాకు అండగా నిలిచిన అల్లం నాగమాణిక్యం అలియాస్ (నాగమ్మ) ధన్యజీవి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆచంట వేమవరం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ మహిళా సంఘం నాయకురాలు అమరజీవి అల్లం నాగ మాణిక్యం సంస్మరణ సభ శనివారం ఆమె ఇంటి వద్ద జరిగింది. ముందుగా ఆమె చిత్రపటానికి కేతా గోపాలన్ పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కష్టాలను ఎదుర్కొంటున్న ప్రజలకు ఎర్రజెండా ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అల్లం నాగమ్మ 50 సంవత్సరాల పాటు తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఆ జెండాకు చేయూతనిచ్చిన ఆమె చిరస్మరణీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పిమోహన్‌రావు, మండల కమిటీ సభ్యులు గుత్తుల రంగారావు, టి.బుల్లబ్బాయి, కుసుమే జయరాజు, సీనియర్ నాయకులు బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, కొండేటి సత్యనారాయణ, చదలవాడ చంటిబాబు, మైలే వెంకట్రావు, తమరాపు దుర్గాప్రసాద్, బళ్లారి సత్యనారాయణ, ఆమె కుమారులు అల్లం నాగమల్లయ్య, సోమచంద్రయ్య పాల్గొన్నారు.

కలుపు మందు తాగి వ్యక్తి మృతి

ఆచంట: కలుపు ముందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆచంటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఆచంట పంచాయతీ పరిధి బాలవారిపాలెంకు చెందిన వెంద్ర శ్రీను (49) కేన్సర్‌తో బాధపడుతున్నాడు. అతని కూతురు మానసిక వ్యాధితో బాధపడుతోంది. తట్టుకోలేక శనివారం ఉదయం ఇంటి వద్ద కలుపు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతని భార్య, కొడుకు హుటాహుటీన ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లగా, వైద్యులు పరిశీలించి 108పై తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైధికారి నిర్ధారించారు. అతని కుమారుడు మురళి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

24న పంచాయతీ కార్మికుల పాదయాత్ర

భీమవరం : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న పంచాయతీరాజ్ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయానికి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు తెలిపారు. శనివారం సంఘం ప్రతినిధి బృందం జిల్లాలోని పాలకొల్లు, మొగల్తూరు, పోడూరు, ఆచంట మండలాల్లో పర్యటించి భీమవరంలో పత్రికలకు వివరాలను విడుదలచేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ టెండర్ పేరుతో డబ్బులు వసూలు చేయడం మానలేదన్నారు. హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ టెండర్ల పేరుతో పంచాయతీ కార్మికులను వేధించడం పోలేదన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు దాటుతున్నప్పటికీ పంచాయతీల అభివృద్ధి గురించి పదేపదే మాట్లాడుతున్న పాలకులు కార్మికుల యోగక్షేమాలను తెలుసుకోకపోవడం దారుణమన్నారు. శివరాం, రాజబాబు, శివకృష్ణ, సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్, పిల్లి ప్రసాదు, బి.సురేష్ పాల్గొన్నారు.